నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, గురువారం 14 మార్చి 2024 | NAGARKURNOOL



సంగంబండ రిజర్వాయర్ పరిధిలో 400 మీటర్ల కెనాల్ తవ్వకానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# జీరో బిల్లులు మారకపోతే డబ్బులు చెల్లించొద్దు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులిస్తాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మక్తల్/మక్తల్ టౌన్, మార్చి 13 : గృహజ్యోతి పథకం కింద పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను మార్చి నెల నుంచే అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎవరికైనా జీరో కరెంట్ బిల్లులు రాకపోయినా.. అధికారులు ఇంటి వద్దకు వచ్చి బిల్లులు చెల్లించాలని అడిగినా.. ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ సమీపంలోని సంగంబండ ఆర్‌ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్ నుంచి ల్యాండ్ అయ్యారు. స్థానిక ఆంజనేయస్వామి, శివాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డితో కలిసి పూజలు చేశారు. ఆలయం నుంచి ఎద్దుల బండ్లపై వచ్చి.. సంగంబండ రిజర్వాయర్ పరిధిలో మిగిలిపోయిన 400 మీటర్ల కెనాల్ తవ్వకానికి భూమిపూజ చేశారు. అక్కడి నుంచి ప్రజాదీవెన సభకు బయలుదేరారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరిగిన సభకు నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సీఎం రేవంత్ సొంత జిల్లా అయిన పాలమూరు ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. వెనుకబడిన మక్తల్ ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీహరి నేతృత్వంలో అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు పెంచామని, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకాలను అమలు చేశామన్నారు. వచ్చే వానకాలం సీజన్ నుంచి సాగు భూములకే రైతుభరోసా సాయం అందిస్తామని తెలిపారు. బీడు భూములు, రోడ్లు, ఇటుక బట్టీలు ఉన్న భూములకు సాయం అందించబోమని తెలిపారు. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన సంగంబండ, భూత్పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, జూరాల బ్యాక్ వాటర్ కింద ముంపునకు గురై భూములు కోల్పోయిన నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సంగంబండ లోలెవల్ కాల్వ బండ తొలగించడానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

**ప్రాజెక్టులను పూర్తిచేస్తాం : మంత్రి ఉత్తమ్**

త్వరలోనే అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులను పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కంకణంకట్టుకున్నదని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. అలాగే పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మక్తల్–కొడంగల్ పథకంగా మార్చామని, నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. వచ్చే ఐదేండ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే సంగంబండ నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.12 కోట్ల పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. మక్తల్‌లో డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్లకు సొంత భవనాలు, 133/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సంగంబండ ముంపు బాధితుల సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీ కేర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తా..

- మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, మార్చి 13 : మండలంలోని ఫత్తేపూర్ మైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఫత్తేపూర్ మైసమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ ఆవరణలో ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే ఎంతో పేరుగాంచిన అమ్మవారి ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే అటవీ అధికారుల అనుమతి తీసుకొని ఇక్కడ భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపాల్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, మాధవులు తదితరులున్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



నవాబ్‌పేటలో పేరుకుపోయిన చెత్తను తరలిస్తున్న పంచాయతీ కార్మికులు

# కదిలిన ట్రాక్టర్.. తొలగిన చెత్త

- విధుల్లో చేరిన పంచాయతీ కార్మికులు
- నెల జీతం చెల్లింపు
- త్వరలో మరో రెండు నెలల జీతాలు చెల్లించేందుకు ఏర్పాట్లు

**నమస్తే ఎఫెక్ట్**

నవాబ్‌పేట, మార్చి 13 : నవాబ్‌పేట మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా పేరుకుపోయిన చెత్త ఎట్టకేలకు తొలగింది. 'పడకేసిన పారిశుధ్యం.. విధులు బహిష్కరించిన పంచాయతీ కార్మికులు' అనే శీర్షికన బుధవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలోని జిల్లా ట్యాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో విధులు బహిష్కరించి ఇతర కూలీ పనులకు వెళ్తున్నారనే కథనం వెలువడింది. ఈ కథనానికి మండల పంచాయతీ అధికారి బద్రూనాయక్ వెంటనే స్పందించారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామ పంచాయతీ కార్మికులకు ఒక నెల జీతం విడుదల చేయాలని ఆదేశించడంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జీపీ నిధుల నుంచి బుధవారం ఒక నెల (డిసెంబర్) వేతనాలు చెల్లించారు. జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు కూడా మరో రెండు రోజుల్లో వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించడంతో మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులు విధుల్లో చేరారు. మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి జీపీ ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. అలాగే గ్రామంలో పేరుకుపోయిన మురుగు కాల్వలను శుభ్రం చేయడంతోపాటు మహిళా స్వీపర్లు మండల కేంద్రంలోని వీధులన్నీ శుభ్రపర్చారు. ఈ సందర్భంగానే మండల పంచాయతీ అధికారి బద్రూనాయక్ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ మండలంలోని అన్ని జీపీల కార్మికులకు ఒక నెల వేతనం వారి ఖాతాల్లో జమ చేశామని, మరో రెండు నెలల వేతనాలు రెండు రోజుల్లో జమ చేస్తామని చెప్పారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పాండూనాయక్, గోవిందు

మహబూబ్‌నగర్‌టౌన్/మరికల్, మార్చి 13 : బీహార్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాలుర జట్టుకు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పాండూనాయక్, నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలోని నేరేడుగం గ్రామానికి చెందిన విద్యార్థి గోవిందు ఎంపికయ్యారు. సూర్యాపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు తరపున చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు సెలక్ట్ అయ్యారు. దీంతో కబడ్డీ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, కబడ్డీ అసోసియేషన్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, బాలరాజు, వెంకటప్ప, శ్రీకాంత్‌రెడ్డి.. పాండూనాయక్, గోవిందును అభినందించారు.



# ఇసుకే బంగారమాయేనా!

### ఇసుక ధరలకు రెక్కలు

ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలో అనేక చోట్ల ఇసుక నిల్వలు ఉచితంగా లభిస్తున్నాయి.. కానీ బహిరంగ మార్కెట్లో అక్రమంగా రవాణా చేసి వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.. దీనికి అధికార యంత్రాంగం.. అధికార పార్టీ నాయకులు తోడుకావడంతో ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది. కొరతను సృష్టించి ఇసుక మాఫియా బ్లాక్‌లో వారికి ఇష్టంవచ్చిన ధరలకు అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఇందులో అధికారులకు, అధికార పార్టీ నాయకులకు వాటాలు చెల్లిస్తూ ఉండడంతో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. టిప్పర్ ఇసుక కావాలంటే రూ.50 వేలు వెచ్చించాల్సిందే.. అదేవిధంగా ట్రాక్టర్ల ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ ఇసుక మాఫియానే బినామీ పేర్ల మీద బుక్ చేసుకొని తక్కువ ధరకే తీసుకొని.. ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా ఇసుక ధర పెరగడంతో కొనలేని పరిస్థితి దాపురించింది. చాలామంది ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేసుకున్నారు.

## ఒక టిప్పర్ @ రూ.50 వేలు
## ట్రాక్టర్ ట్రిప్ రూ.6 వేల పైమాటే..

- గృహనిర్మాణ రంగం కుదేలు
- పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల విలవిల
- ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే రీచ్‌ల నుంచి తరలింపు?
- నారాయణపేట జిల్లాలో కలెక్టర్ పేరుతో ఇసుక మాఫియా జోరు
- ప్రభుత్వ పనులకు కూడా కరువే..
- జర్నలిస్టుల పేరు మీద ఓ ఎమ్మెల్యే మేనమామ అక్రమ రవాణా..

మహబూబ్‌నగర్, మార్చి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇసుక బంగారమైంది. కొరతతో భవన నిర్మాణ రంగం కుదేలవుతున్నది. దీనిపై ప్రత్యక్షంగా.. పరోక్షంగా.. ఆధారపడ్డ వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఎండాకాలం కావడంతో భవన నిర్మాణ రంగానికి చాలా అనువైన సమయం. ఈ టైంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇసుక కొరతను సృష్టించి మాఫియా చెలరేగిపోతుంది. ఇటు పోలీసులు, రెవెన్యూ అధికారులు.. అటు మైనింగ్ శాఖ అవినీతికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. ఫలితంగా తక్కువ ధరకు దొరకాల్సిన ఇసుక ఏకంగా ఓ టిప్పర్ ధర రూ.50 వేల పలుకుతున్నది. అది కూడా బ్లాక్‌లోనే. కొన్ని జిల్లాల్లో మన ఇసుక పేరు మీద ఆయా కలెక్టర్లు గుర్తించిన రీచ్‌లలో కూడా మాఫియా చెలరేగిపోతుంది. అమాయకుల పేరు మీద ఇసుకను బుక్ చేసుకుంటూ వాటిని బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ఫలితంగా ఇసుక ధర ఆకాశాన్నంటింది. సామాన్యులకు ఇసుక లభించని పరిస్థితి తలెత్తింది. ఇక గ్రామాల్లో అయితే ట్రాక్టర్ ఇసుక ధర రూ.6 వేలకుపైగా పలుకుతున్నది. కొంతమంది దొంగచాటుగా ఇసుకను ఎడ్లబండ్లపై రాత్రికి రాత్రి తరలిస్తున్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**పేటలో కలెక్టర్ పేరుపై..**

నారాయణపేట జిల్లాలో కలెక్టర్ పేరుపై ఇసుక మాఫియా చెలరేగుతుంది. అన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఇసుక మాఫియా జోరుగా నడుస్తుంది. మామూళ్ల మత్తులో అధికారులు ఉండడంతో రాజకీయ నాయకులు చెప్పిందే వేదంగా మారింది. కొన్నిచోట్ల ప్రజలు అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్నా క్షణాల్లోనే వాటిని వదిలేస్తున్నారన్న అపవాదులు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో వాగులు వంకల్లో ఇసుక నిల్వలు చాలా ఉన్నాయి. వాటిని ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా వినియోగిస్తే ఎలాంటి కొరత ఉండదు. కానీ అధికార యంత్రాంగం ఇసుక మాఫియా.. ఎమ్మెల్యేలు కుమ్మక్కు కావడంతో ఇసుక దొరకని పరిస్థితి దాపురించింది. దీంతో చాలా జిల్లాల్లో నిర్మాణరంగం ఎక్కడికక్కడ ఆగిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏకంగా జర్నలిస్టుల పేరుపై ఓ ఎమ్మెల్యే మేనమామ అక్రమంగా ఇసుకను తరలించడం వివాదాస్పదంగా మారింది. అన్నిచోట్ల ఎమ్మెల్యే ప్రత్యక్షంగా చొరవ తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మాఫియా ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యాపారం సాగుతున్నది. అధికారులు ఎవరైనా పట్టుకుంటే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులమంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని పోలీసులే చెబుతున్నారు. దీంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**నిర్మాణ రంగంపై ప్రభావం..**

ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరతను సృష్టించిన అధికారపార్టీ నాయకులు, ఇసుక మాఫియా ఆగడాలు భవన నిర్మాణరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎండాకాలంలో చాలామంది కూలీలకు పనులు దొరకని పరిస్థితి. దీంతో వారంతా భవన నిర్మాణ పనులకు ఎక్కువగా వెళ్తుంటారు. ఈ నాలుగు నెలలు సీజన్. ఇసుక కొరతతో కూలీలకు కూడా పనులు లేకుండా పోయాయి. వారి కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొన్నది. అయితే ఇసుక కొరతను ఆసరాగా చేసుకున్న మాఫియా రెచ్చిపోతుంది. భవన నిర్మాణ రంగంలో మిగతా మెటీరియల్ చౌకగా దొరకుతున్నా.. ఉచితంగా లభించే ఇసుకను మాత్రం రూ.వేలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. మరోవైపు అధికార పార్టీ నాయకులకు కూడా మాఫియాకు అండదండలు అందిస్తుండడంతో వాళ్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సైతం వారికి అండగా ఉండడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. వాళ్లు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇతరత్రా పరిస్థితుల్లో ఇసుకను తరలిస్తుంటే వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారు. మామూలు ఇచ్చిన టిప్పర్లు, ట్రాక్టర్లను మాత్రం వదిలి పెడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల డబుల్ బెడ్రూం నిర్మాణంలో నారాయణపేట జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే మేనమామ అక్రమాలకు తెర లేపారు. పేట నియోజకవర్గానికి సంబంధించిన మండలం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండడంతో అక్కడ ఇసుకను తరలించేందుకు అనుమతులు తీసుకొని జర్నలిస్టులకు మొండిచేయి చూపించారు. అదే జిల్లాలోని మరో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అధికారులను బెదిరిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యే నేరుగా అధికారులకు ఫోన్ చేసి ఇసుక టిప్పర్ల జోలికి వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇసుక మాఫియాతో చేతులు కలిపి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు.



సగంలోనే నిలిచిపోయిన ఇంటి నిర్మాణ పనులు

### మామూళ్ల మత్తులో..

ఉమ్మడి జిల్లాలో ఇసుకను తక్కువ ధరకు అందించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఇసుక మాఫియాకు వత్తాసు పలుకుతున్నారు. పేరుకే మన ప్రాంతం.. మన ఇసుక–మన పాలమూరు పేరు మీద ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టులు అప్పగిస్తున్నారు. పేరుకు అక్కడ వీఆర్‌ఏలు, రెవెన్యూ అధికారులను పర్యవేక్షణ పేరుతో ఉంచి బహిరంగంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒక టిప్పర్‌లో ఆరు క్యూబిక్ మీటర్ల ఇసుక వేయాల్సి ఉండగా 8 నుంచి 10 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఎక్కువ మోతాదులో వేసి రవాణా చేస్తున్నారు. ఎక్కువ వేసిన ఇసుకకు డబ్బులను వసూలు చేస్తున్నారు. మరోవైపు ఒకే బుకింగ్ మెసేజ్‌తో రెండు, మూడు ట్రిప్పులు అదనంగా తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నది. కాగా ఇక్కడ ఇసుకను ఇటాచీల ద్వారా టిప్పర్లు, ట్రాక్టర్లలోకి లోడ్ చేసే పనిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇసుక మాఫియా ఈ కాంట్రాక్టులను చేజిక్కించుకొని అధికారులను మచ్చిక చేసుకొని అక్రమాలకు తెర లేపుతున్నారు. నారాయణపేట జిల్లాలో కలెక్టర్ పేరు చెప్పి ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ నడుస్తున్న అన్ని రీచ్‌లను ఎమ్మెల్యే అనుచరులే దగ్గరుండి నడపడం అనుమానాలకు తావిస్తోంది. ఫలితంగా గృహ నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నడూ లేని పరిస్థితిని గృహనిర్మాణదారులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఇసుకను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకొచ్చి మాఫియా ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కీచక గురువులు!

- బిడ్డల్లాంటి చిన్నారులపై లైంగిక వేధింపులు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏడాదిలోనే కటకటాల పాలైన ముగ్గురు ఉపాధ్యాయులు
- విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు
- సస్పెన్షన్ విధించిన డీఈవో
- మానవ మృగాలను కఠినంగా శిక్షించాలంటున్న విద్యావేత్తలు

గద్వాల, మార్చి 13 : గురుబ్రహ్మ.. గురువిష్ణు.. గురుదేవో మహేశ్వర.. గురు సాక్షాత్ పరబ్రహ్మ.. తస్మయ్.. శ్రీగురవే నమః అనే మాటలకు సమాజంలో ఎంతో విలువ, గౌరవం ఉన్నది. అయితే కొందరు గురువుల వల్ల ఆ మాటలకు సమాజంలో అర్థం లేకుండా పోతున్నది. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువుల విద్యాబోధన ద్వారా వారు బావిభారత పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది. అలాంటి విద్యార్థులను తయారు చేయాల్సిన ఉపాధ్యాయులే దారి తప్పుతుంటే వారిని చూసిన విద్యార్థులు ఏం నేర్చుకుంటారు.. వారు అదే బాటలో పయనించడం షరా మామూలే. అయితే, పాఠశాలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు అందరూ మన కూతురు లేదా కుమారుడు, చెల్లి, తమ్ముడు వయస్సు ఉన్నవారే ఉంటారు. అయితే అటువంటి అభం శుభం తెలియని విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులే వారిని లైంగికంగా వేధిస్తే ఆ చిన్నారులు ఆ విషయాన్ని అటు తల్లిదండ్రులకు, ఇటు మిత్రులకు చెప్పలేక లోలోన మదన పడుతున్నారు. ఒక వేల తల్లిదండ్రులకు చెబితే పాఠశాల మార్పిస్తారనే భయం ఓ వైపు.. గురువులు ఏం శిక్ష విధిస్తారో అనే బాధ మరో వైపు ఉంటూ కామ పిశాచాల లాంటి దారితప్పుతున్న గురువుల మధ్య వారు పెట్టే చిత్రహింసలను భరిస్తున్నారు. ఈ విషయాలు విద్యాశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోక పోవడంతో గురువులు తమ మానసిక ఆనందం కోసం బిడ్డలలాంటి చిన్నారుల పట్ల మృగాలుగా ప్రవరిస్తూ కొంతమంది ఉపాధ్యాయ వృత్తికే కళంకం తీసుకొస్తున్నారు. జిల్లాలో కొందరి ఉపాధ్యాయుల తీరు వల్ల విద్యావ్యవస్థ నాశనమయ్యే పరిస్థితి నెలకొన్నది. అలాంటి పరిస్థితి జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకోవడంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటేనే తల్లిదండ్రులు వెనుకడుగు వేసే పరిస్థితి దాపురించింది.

ఈ కారణంగా చాలా మంది అమ్మాయిలను మధ్యలోనే చదువు మాన్పించేస్తున్నారు. ఈ పాపం ఎవరిది అంటే ముమ్మాటికి ఉపాధ్యాయులదేనని చెప్పొచ్చు.

**మానసిక ఆనందం కోసం..**

ఉపాధ్యాయులంటే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని సరైన మార్గంలో నడిపించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉంది. కానీ కొంత మంది ఉపాధ్యాయులు వారి మానసిక ఆనందం కోసం దారి తప్పుతున్నారు. మూడు రోజుల కిందట మల్దకల్ మండలం విఠలాపురం పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు అక్కడి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తుంటే ఈ విషయం అక్కడి పెద్దసార్‌కు చెప్పారు. అయినా ఆయన ఏమీ పట్టించుకోక పోవడంతో ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలు ఎక్కువయ్యాయి. ఇది భరించలేని విద్యార్థులు బాలల సంరక్షణకు కమిటీకి ఫిర్యాదు చేశారు. వారు పాఠశాలకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడితే ఆ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో వెకిలి చేష్టలు చేయడమే కాకుండా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని వారికి చెప్పడంతో బాలరక్షణ సిబ్బంది కంగుతిన్నారు. ఇలాంటి విషయాలు ఆయనకు నిత్యకృత్యమని విద్యార్థినులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన బాలరక్షణ సిబ్బంది ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ దృష్టికి వెళ్లడంతో సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే విద్యార్థినుల పట్ల మానవమృగాలుగా వ్యవహరిస్తున్నా కొంతమంది ఉపాధ్యాయులకు కొన్ని సంఘాలు వారిని కాపాడే ప్రయత్నం చేయడంలో భాగంగా సస్పెన్షన్ ఎత్తివేయాలని రాజకీయ నాయకుల నుంచి విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.



ఆరు మాసాల కిందట గద్వాల మండలం అనంతపురం పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తే గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఇతడిపై కేసు నమోదు కాగా జైలుకు వెళ్లాడు. గతేడాది మల్దకల్ మండల కేంద్రంలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిని మానసికంగా, లైంగికంగా వేధించడంతో అతడికి గ్రామస్తులు బుద్ధి చెప్పి విద్యార్థిని తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పించారు. ఇలా జిల్లాలో ఏడాదిలో ముగ్గురు గురువులు విద్యార్థినులను లైంగికంగా వేధించిన కేసుల్లో ఊచలు లెక్క పెడుతున్నా ఇంకా కొంత మంది ఉపాధ్యాయుల్లో మాత్రం మార్పురావడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారికి కఠిన శిక్షలు అమలు చేసి విద్యా, ఉపాధ్యాయ వ్యవస్థకు కళంకం రాకుండా చూడాలని మేధావులు కోరుతున్నారు.